## అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**కంది, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** మండల పరిధి లోని మామిడిపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు. అంగన్‌వాడీలో కొనసాగుతున్న కార్యక్రమాలపై కేంద్రం బాధ్యులను చంద్రశేఖర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, సిడిపిఒ జయరామనాయక్, ఎంపిడిఒ పి.శ్రీనివాస్, ఎంపిఒ మహేందర్‌రెడ్డి, అంగన్ వాడీ టీచర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

### ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడితే

## కఠిన చర్యలు తప్పవు : సిపి అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లాలో ఎవరైనా క్రికెట్‌తో ఇతర బెట్టింగ్‌లకు పాల్పడిన ప్రోత్స హించిన కఠినంగా వ్యవహరిస్తామని సీపీ డాక్టర్ అనురాధ హెచ్చరించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంగా రాష్ట్రంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత అధికంగా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవడంతో పాటు అప్పుల పాలై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని తెలిపారు. బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నట్లు దేశంలో ఐపిఎల్ సీజన్ ప్రారంభం కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టాలన్నారు. బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు పెద్దయెత్తున చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడిన ప్రోత్సహించిన వారి వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబరు 8712667100కు సమాచారం అందించాలన్నారు.

### నేడు ఆత్మకమిటీ చైర్మన్‌గా మల్లారెడ్డి ప్రమాణ స్వీకారం

**-హాజరుకానున్న మంత్రి దామోదర్**

**చౌటకూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెక్రియాల గ్రామానికి చెందిన కాంగ్రెస్‌నాయకులు తిమ్మారెడ్డిగారి మల్లారెడ్డి జోగిపేట డివిజనుకు ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఈనెల 10వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 11 గంటలకు జరిగే పదవీ స్వీకారోత్సవానికి మంత్రి సి.దామోదర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. చైర్మన్ గా మల్లారెడ్డితో పాటు మరో 23 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి హత్నూర, చౌటకూరు పుల్‌కల్, అందోల్ మండలాలతో పాటు నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు తరలిరానుండటంతో వ్యవసాయ శాఖ అధికారులు తగు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యారు.

### మహాత్మ జ్యోతి బాపూలే వసతి గృహాన్ని పరిశీలించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**దుబ్బాక ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండలంలోని హబ్సీపూర్ గ్రామ పరిధిలోని మహత్మ జ్యోతిబాపూలే బాలుర వసతి గృహన్ని జిల్లా కలెక్టర్ మను చౌదరి బుధవారం పరిశీలించారు. వసతి గృహంలోని విద్యార్థులతో మాట్లాడి మౌలిక వసతులు పరిశీలించారు. వసతి గృహంలోని విద్యా, సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి భోజనం, మంచి విద్యతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ చౌదరి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఉన్నత స్థాయిలో నిలవాలని కోరారు. విద్యార్థులు విద్యాతో పాటు క్రీడా రంగాల్లో కూడా ప్రోత్సహించాలని వసతి గృహ ప్రధానోపాధ్యాయుడు గోపాల్ రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ సంజీవ్‌కుమార్ ఎంపీడివో భాస్కర్ శర్మ, ఎంఈఓ ప్రభుదాస్, తదితర అధికారులు, గురుకుల పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## కస్తూర్బా హాస్టల్‌ను అదనపు కలెక్టర్ తనిఖీ

**వరుస ఆకస్మిక తనిఖీలతో టేక్మాల్ మండలంలో అలజడి**



కస్తూర్బాలో రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

**టేక్మాల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** టేక్మాల్ కస్తూర్బా గాంధీ వసతి గృహాన్ని మెదక్ జిల్లా అదనపుకలెక్టర్ మంచు నగేష్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆకస్మిక తనిఖీలతో టేక్మాల్ అధికారుల్లో అలజడిరేగింది. జిల్లా కలెక్టర్ టేక్మాల్ మండలాన్ని శ్రీరామనవ పండగ రోజు అని చూడకుండా జిల్లా ఆకస్మిక తనిఖీ చేసి అధికారుల్లో అలజడి రేపిందని చెప్పక తప్పదు మరి. టేక్మాల్ మండల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును తెలుసుకునేందుకుగాను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారని అధికారుల్లో అలజడి మొదలైంది. ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదని ఆయా శాఖల అధికారులు వారి కార్యాలయాల్లో గుసగుసమంటూ మాటలు వినిపిస్తున్నాయి. సమయపాలన పాటించని అధికారుల తీరు, అధికారుల నిరక్ష్య వైఖరిని ఎత్తిచూపుతున్న పట్టించుకోవడం లేదన్న సందర్భాలు జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లాయని అనుకుంటున్నారు. సమాచారం లేకుండా ఎప్పుడైనా రావచ్చు తనిఖీలు చెయ్యొచ్చు అన్న సాంకేతాలతో అధికారులు అప్రమత్తమైనట్లు కనిపిస్తోంది. దీంతో టేక్మాల్ మండలంలో జిల్లా అధికారుల తనిఖీలతో అలజడి మొదలైంది.

## ఉచిత వృత్తి కోర్సులను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా యువజన, క్రీడల అధికారి దామోదర్‌రెడ్డి**

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఏర్పాటు చేసిన వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నిరుద్యోగ యువతీ,యువకులకు వివిధ స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ ఇవ్వడానికి 12వ బ్యాచ్ తరగతులు ప్రారంభం అవుతాయని జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోగల వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఈ నెల 15వ తేదీలోపు దరఖాస్తులను సమర్పించాలని వివరించారు. ప్రతి కోర్సులో ఒక బ్యాచ్‌కి 30 మంది అభ్యర్థులకు మాత్రమే అవకాశం ఉంటుందని, శిక్షణ పూర్తికాలం 3 నెలలు ఉంటుందని, కోర్సు పూర్తయ్యాక పరీక్ష నిర్వహించి ప్రభుత్వంచే జారీ చేసిన సర్టిఫికెట్ అందించడం జరుగుతుంది. కోర్సుల వివరాలు.. ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సు(బ్యూటీ పార్లర్), కంప్యూటర్ కోర్సు(ఎంఎస్‌ఆఫీస్), సిసిటివి రిపేర్, అమరిక కోర్స్, కంప్యూటర్ హార్డ్ వేర్, ఎలక్ట్రికల్(హౌస్ వైరింగ్), మొబైల్ సర్వీసింగ్, రిపేర్, జర్దోషి (మగ్గం వర్క్). ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్ రెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు సెంటర్ ఇంఛార్జ నెం 7396313741 లో సంప్రదించాలని సూచించారు.

## వెంకటేశ్వరస్వామి రథోత్సవం రమణీయం

**పాపన్నపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో చెరువు గుట్టపై వెలిసిన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా 3వరోజైన మంగళవారం రాత్రి లంక దహనంతోపాటు రథోత్సవ కార్యక్రమాలు రమణీయంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ గురుమూర్తిగౌడ్ స్వర్గీయులు గజవాడ లక్ష్మీనారాయణ, కుమారులు రాజేశ్వర్‌గుప్తాను 18 పనిబాటల వారు ఇంటికి వెళ్లి బొట్టు చెల్లించి డప్పు చప్పుళ్లతో జాతరు ఆహ్వానించారు. రథోత్సవం ముందు భారీఎత్తున అన్నంతో రతి నిర్వహించి 18 పని బాటల వారు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పాటలు ఆలపిస్తూ గోవింద నామాలు స్మరిస్తూ రథోత్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్, తూర్పు రాజారామ్, శ్రీనివాస్‌గౌడ్, సుంకరి కృష్ణ, భూమాగౌడ్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు

**మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



చంద్రుతండలో భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్

**టేక్మాల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడుతుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. టేక్మాల్ మండలం చంద్రుతండా గ్రామ పంచాయతీ సిబ్బంది రమావత్ పిర్యా, మంజుల ఇంట్లోనబుధవారం సన్నబియ్యంతో వండిన వంటకాలతో లబ్ధిదారులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందించాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. సన్న బియ్యం అమలులో ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సన్నబియ్యంతో భోజనం సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. పేదలందరికీ పూర్తి స్థాయిలో ఆహార భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ఆహార భద్రతా కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తుల కుటుంబ వివరాలతోపాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. భోజన అనంతరం కలెక్టర్ రమావత్, పిర్యా కుటుంబ సభ్యులకు శాలువాలు కప్పి, స్వీట్స్ అందజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి అర్హులైనవారికి ప్రభుత్వం సూచించిన విధంగా ఇళ్ల నిర్మాణం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యాదయ్య, ఎంపిడిఓ విఠల్, తహసీల్దార్ తులసిరామ్, ఎంపిఈఓ రియాజోద్దిన్, ఆర్ఐ శ్రీకాంత్, నాయకులు సర్దార్, సంతోష్, ఉన్నారు.

## బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేదిలేదు

**-ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి**

గజ్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త): జ్యోతిబాపూలే స్ఫూర్తితో బిసిలు సంఘటిత ఉద్యమాలకు సిద్ధమై హక్కులు సాధించుకుందామని రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షులు, బిఆర్ఎస్ లీగల్‌సెల్ నేత కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసిల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన సర్వాయి పాపన్న, పండగ సాయన్న, కొరివి కృష్ణస్వామిల స్ఫూర్తితో ఉద్యమించి కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు పార్లమెంటులో 42 శాతం బిల్లు ఆమోదించే వరకు తెలంగాణ తెగింపును ప్రదర్శిస్తామని హెచ్చరించారు. ఈనెల 11వ తేదీ లోపు సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఆవరణలో జ్యోతిబాపూలే విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎంతమాత్రం సహించమని, పాలకులను, బిసిలను మభ్యపెట్టడం కాకుండా ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, లేనిపక్షంలో ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో ఉద్యమాలకు ఊపిరిపోసి హక్కులు సాధించుకుంటామని హెచ్చరించారు.

## బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్ ప్రాంతాల్లో చర్యలు




కోళ్ల ఫామ్ వద్ద హెచ్చరిక ప్లెక్సీ ని ఏర్పాటు చేసిన దృశ్యం

**సిద్దిపేట రూరల్(తొగుట),ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** తొగుట మండలం కాన్గల్‌లో గల మైనా లేయర్ కోళ్ల ఫామ్‌లోని కోళ్లకు హెచ్5ఎన్1 ఏవియన్ ఇన్ఫ్లుంజా వైరస్(బర్డ్ ఫ్లూ) సోకినట్లు అధికారులు నిర్ధారించిన విషయం తెలిసిందే!, కోళ్ల ఫామ్‌లో గత కొద్ది రోజుల నుంచి కోళ్లు చనిపోతుండడంతో ఈనెల 3న హైదారాబాద్‌లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో తెలియజేశారు. అధికారులు ఫామ్‌లోని కోళ్ల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించగా బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో అధికారులు బర్డ్ ఫ్లూ ఇతర ప్రాంతాలకు సోకకుండా అప్రమత్తమై పటిష్టమైన చర్యలు చేపట్టారు. ఫాంలో 20 వేల కోళ్లు చనిపోగా మిగితా 50 వేల కోళ్లకు సైతం బర్డ్ ఫ్లూ సోకడంతో అధికారుల పర్యవేక్షణలో చంపి శాస్త్రీయ పద్ధతిలో భూమిలో పూడ్చి వేస్తున్నారు. కోళ్ల ఫామ్‌లో పని చేసిన కూలీలకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల ఫామ్ పరిసర ప్రాంతాలలో వాహనాల రాకపోకలు జరగకుండా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో 8500404016 కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమానాలు ఉన్న వెంటనే కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలన్నారు.

## ప్రజ్ఞాపూర్‌లో ఘనంగా సీతారాముల రథోత్సవం

**గజ్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** శ్రీరామనవమి సందర్భంగా ప్రజ్ఞాపూర్ లోని కోదండరామాలయంలో శ్రీసీతారాముల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయం నుండి జగదేవ్‌పూర్ చౌరస్తా వరకు అక్కడి నుండి రామాలయం వరకు రథాన్ని ఊరేగించారు. మహిళలు కోలాటం ఆడగా భక్తులు భజనలు చేస్తూ రథాన్ని ముందుకు లాగడం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పొద్దుటూరి విశ్వనాథం, పొద్దుటూరి శేఖర్, నరేందర్, గోపిశెట్టి అశోక్, భాస్కర్, కుర్రె మహేందర్ రెడ్డి, హనుమంతరెడ్డి, ఐల సుధాకర్, ఉపేందర్, మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎల్ల శ్రీనివాస్, మహి, పొద్దుటూరి శ్రీనివాస్, కుర్రె సాయిరెడ్డిలతో పాటు లోక్‌సత్తా ఉభయ రాష్ట్రాల కన్వీనర్ బండారు రాంమోహన్‌రావు, సీనియర్ న్యాయవాది బండారు ఫణీంధర్‌రావు, బండారు రాంప్రసాద్‌రావు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



బ్రిటన్ నిపుణుడు డాక్టర్ అనిర్బన్ గుహను సత్కరిస్తున్న దృశ్యం

## సముద్ర తరంగాల అస్థిరతలపై అధ్యయనం

**బ్రిటన్ నిపుణుడు డాక్టర్ అనిర్బన్ గుహ**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** సముద్రతరంగాల అస్థిరతలపై చేసిన పరిశోధన, అధ్యయనాంశాలను బ్రిటల్ డండీ విశ్వవిద్యాలయంలో పర్యావరణ ద్రవ మెకానిక్స్‌లో సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ అనిర్బన్ గుహ వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సముద్ర తరంగాల అస్థిరతల్లపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సముద్ర పొరలలో పదునైన సాంద్రత పొరలు, వాటి సుదూర అనువర్తనాల లోతైన అన్వేషణను సదస్యులతో పంచుకున్నారు. ప్రపంచ సముద్ర నమూనాలను మెరుగుపరచడంలో, వాతావరణ అంచనాలను మెరుగుపరచడంలో, జలాంతర్గామి నావిగేషన్, ఆఫ్ షోర్ నిర్మాణాల కోసం వేవ్ లోడింగ్ విశ్లేషణలో వాటి ఔచిత్యాన్ని ఆయన నొక్కి చెప్పారు. డాక్టర్ గుహ క్లాసికల్ లీనియర్ స్టెబిలిటీ సిద్ధాంతాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించారు. సాంప్రదాయ సాధనాలు కొన్ని సందర్భాల్లో ఎందుకు లోపభూయిష్టంగా ఉండవచ్చో ఆయన వివరించారు. ప్రవాహం ప్రారంభంలో కొన్ని పరిస్థితులలో స్థిరంగా కనిపించినప్పటికీ, అది ఘాతాంక పెరుగుదల ద్వారా అస్థిరతలోకి మారగలదని డాక్టర్ గుహ పేర్కొన్నారు. అయితే దీనిని ఇప్పుడు మెరుగైన ఖచ్చితత్వంతో అంచనా వేయవచ్చన్నారు. తరంగ ఆధారిత అస్థిరతలు ఎక్కువగా అభివృద్ధిచెందే అవకాశం ఉన్న క్లిష్టమైన పొడవు ప్రమాణాలను గుర్తించడంలో ఆయన పరిశోధన కొత్త అంతర్దృష్టులను అందిస్తోంది. తొలుత, ప్రొఫెసర్ బి.ఎం.నాయుడు అతిథిని స్వాగతించి, సదస్యులకు పరిచయం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, ఇతర అధ్యాపకులతోకలిసి డాక్టర్ గుహను శాలువ, జ్ఞాపికలను ఇచ్చి సత్కరించారు. కాగా, ఈ అతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని డాక్టర్ లిమా బిశ్వాస్, డాక్టర్ వి.కామేశ్వర శ్రీధర్ సమన్వయం చేశారు. ఈ ఉపన్యాసం అధ్యాపకులను ద్రవ డైనమిక్స్, పర్యావరణ శాస్త్రంలో అత్యాధునిక పరిశోధనలకు పురిగొలిపింది.

## ప్లాస్టిక్ వాడినా, విక్రయించినా చర్యలు

**-మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు, వ్యాపారస్తులు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడినా, విక్రయించినా జరిమానాలతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదేశాల మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను నిషేధించడం జరిగిందన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, కట్లరీ వస్తువులైన ఫోర్కులు, స్పూన్లు, కత్తులు, స్ట్రాలు, ట్రేలు, స్వీట్‌బాక్స్‌లలో వాడే వ్రాపింగ్ ఫిల్ములు, ప్యాకింగ్ ఫిల్ములు, ఇన్విటేషన్ కార్డులు, 100 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పివిసి బ్యానర్లు, స్టిక్కర్లు, ఇయర్ బర్డ్స్, ప్లాస్టిక్ స్టిక్స్ వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసినా, విక్రయించినా, వాడినా, నిల్వ చేసినా, రవాణా చేసినా చట్టరీత్యా నేరమని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

## సిఐ సైదాకు భద్రాచల ప్రసాదం అందజేసిన రామరాజు

**గజ్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** భద్రాచలం దేవస్థానంలో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ ప్రసాదంను బుధవారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ సైదాకు శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ సైదా మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారాముల ప్రసాదం అందజేసినందుకు అభినందించారు.

# బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

**జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** జిల్లాలో ఎవరైన క్రికెట్, ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత అధికంగా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులోపడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పుల పాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి సాధించడంతో ప్రతి ఒక్కరికీ ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతో పాటు, సోషల్ మీడియా సైతం యువతకు మరింత చేరువైందని, తద్వారా మోసగాళ్ల మోసపూరితమైన ప్రకటనలు, సందేశాలకు యువత ఆకర్షితులై సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగాగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌తో పాటు, ఇతరత్రా బెట్టింగ్‌లవైపు యువత ఇంటి సభ్యులకు తెలియకుండా వీటిల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా పూర్తిగా నష్టపోవడంతో పాటు కొన్ని సందర్భాల్లో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఈ బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందని, ముఖ్యంగా ప్రస్తుతం దేశంలో ఐపీఎస్ సీజన్ ప్రారంభమైందని, ఇది దృష్టిలో వుంచుకోని తల్లి దండ్రులు సైతం తమ పిల్లలపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా వారు క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అయ్యే సమయాల్లో వారి ప్రవర్తతో పాటు, వారు సెల్‌ఫోన్‌లలో మాట్లాడే సంభాషణపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు. జిల్లా పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకుగాను పెద్దఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం పోలీసులకు అందుబాటులోవున్న టెక్నాలజీని వినియోగించుకోవడంతోపాటు, టాస్క్‌ఫోర్స్ ఇతర ప్రత్యేక బృందాలను వినియోగించుకోవడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో ఎవరైన బెట్టింగ్‌లను పాల్పడిన, పోత్సహించిన వారిపట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని, ఎవరైన బెట్టింగ్‌లకు పాల్పడినట్లుగా సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకు గానీ లేదా డయల్ 100 కు, జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



సూపరింటిడెంట్‌కు సమ్మె నోటీసును అందేస్తున్న పంచాయతీ కార్మికులు

## 19 తర్వాత పంచాయతి కార్యదర్శుల రాష్ట్రవ్యాప్త సమ్మె

**సదాశివపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఈ నెల 19 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తున్నట్లు గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటిడెంట్ అనిత్‌కు సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ పంచాయితీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, పలు గ్రామాల్లో గత 4 మాసాలుగా వేతనాలు అందుకోలేదని గుర్తు చేశారు. ఎన్నికల ముందు చేసిన హామిలో భాగంగా వేతనాలను పెంచాలని, మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం గ్రామాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్న కార్మికులు వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 19వ తేదీ తరువాత ఎప్పుడైన రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ యూనియన్ నాయకులు యాదమ్మ, రామచందర్, ఆనందం చంద్రయ్య, వెంకటేశం, కిష్టయ్య, ఏవన్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలి

**-కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన టిసిపిఐ జిల్లా కార్యదర్శి**

**కొండాపూర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మన్సాన్‌పల్లి, మునిదేవునిపల్లిలో అక్రమ వెంచర్లకు అనుమతులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం టి సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ జిల్లా కలెక్టరేట్‌లో డిఆర్‌ఓకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఇళ్లకు, వెంచర్లకు నోటీసులు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శులు బిల్డర్‌లకు సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని, అక్రమానికి పాల్పడుతూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న పంచాయితీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఎరువులు వాడినా తగ్గిన దిగుబడి

**రకరకాల రసాయన ఎరువులు పిచికారి చేసిన ఫలితం శూన్యం**

**వరి పంటలో 80 తెల్ల కంకి వడ్లు**

**పెట్టిన పెట్టుబడి రాక లబోదిబో మంటున్న రైతులు**

**హవేలీఘనపూర్, ఏప్రిల్ 9,ప్రభాతవార్త:** ఈసారి యాసంగి సీజన్లో వరి పంటలలో రైతులకు అనేక ఇబ్బందులతో పాటు ఎన్ని రకాల రసాయన ఎరువులు వాడిన పిచికారి చేసిన ఆశించిన ఫలితం శూన్యమైందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు వరి పంటలో 80 శాతం వరకు తెల్ల కంకి వడ్లు రావడంతో దిగబడి రాక పెట్టిన పెట్టుబడితో పాటు తెచ్చిన అప్పులు మిత్రులకు సరిపోకుండా పంట దిగుబడి నష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు వారి విత్తనాలు వేసినప్పటినుండి వరి కోతకు వచ్చిసరికి వేల రూపాయలు రసాయన ఎరువులు వాడిన పంట దిగుబడిలో మాత్రం ఫలితం కనిపించలేదని రైతులు అన్నారు. మిగిలిన 20 శాతం వరిని కోసినప్పటికీ మిషిన్ కిరాయి అదనంగా భారం అవుతుందని అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నా మని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు రైతు దుక్కుదిన్నీ విత్తనాలు వేసి పంట పండించి చేతికి వచ్చేవరకు నమ్మలేని పరిస్థితి ఉందని అన్నారు.ప్రభుత్వాలు రైతే రాజు అన్నప్పటికీ రైతుల అప్పులుగా అప్పుల రాజులుగా మారుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అండగా వ్యవసాయ అధికారులు ప్రభుత్వాలు పనిచేయాలని వారు ముందస్తు లేకనే రైతులకు సరియైన అవగాహన కల్పించక ఇలాంటి క్రిమిసంహారక కీటకాలతో పంటలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు గతంలో మండలానికి వ్యవసాయ అధికారి ఒక్కరే ఉండగా నేడు ఐదు గ్రామాలకు ఒక విస్తరణ అధికారి ఉన్నప్పటికీ రైతులకు సరియైన అవగాహన కల్పించలేకపోతున్నారని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.మండల వ్యవసాయ అధికారులు మాత్రం ఏనాడు కనిపించకపోవడం మండలంలో రైతులకు ఏదైనా సమావేశం ఉంటే మాత్రం రావడం తప్ప క్షేత్రస్థాయిలో వారు పరిశీలనకు గాని రాకపోవడం రైతులకు సలహా సూచనలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ప్రస్తుత టెక్నాలజీతో లేక సమస్యలు పరిష్కారం అవుతుంటే రైతులకు సంబంధించిన పంటల దిగుబడికి ఇలాంటి చర్యలు చేపట్టకపోవడం రైతులను ఆవేదనకు గురి చేసినట్లే అని అన్నారు ఇప్పటికైనా జిల్లా అధికారులువ్యవసాయ శాఖ అధికారులు సంబంధిత శాఖ మంత్రులు విచారణ చేపట్టి నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం అందే విధంగా చూడాలని, మళ్లీ ఇలాంటి జరగకుండా ముందస్తు రైతులకు అవగాహనతో పాటు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి రైతులకు ఎప్పటికప్పుడు సమస్యలు రాకుండా చూసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు శాఖ సంబంధించిన మంత్రులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందే విధంగా చూడాలని వారు కోరారు.

### పెళ్లింట విషాదం

## కుమారుడి వివాహం అయిన గంటకే తల్లి మృతి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మేళ తాళాలు.... మంగళ వాయిద్యాలు.. వేద పండితుల మధ్య వైభవంగా పెళ్లి జరుగుతుండగా తీవ్ర విషాదం నెలకొంది. వరుడి తల్లి వివాహం జరిగిన గంటలోపే మృతి చెందింది. ఈ హృదయవిదారక ఘటన మండల పరిధి సూరారం గ్రామంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన నరసమ్మ(48), శ్రీనివాస్‌గౌడ్ దంపతులు. వీరికి రవీందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా లక్ష్మీనరసమ్మ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. తల్లి కోరిక మేరకు పెద్ద కుమారుడు రవీందర్‌గౌడ్ వివాహం చేసుకోవాలనుకున్నాడు. బుధవారం ఉదయం 8 గంటలకు మెదక్ పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో రవీందర్‌గౌడ్ వివాహం జరిగింది. ఇంతలో వార్త వారిని విషాదంలో మునిగిపోయేలా చేసింది. పెళ్లయిన గంట వ్యవధిలో ఆసుపత్రిలో తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరయ్యారు. ఒక పక్క శుభకార్యం జరుగుతున్న వేళ చావు వార్త వారి కుటుంబాన్ని కలిచి వేసింది.

## వివాహిత అదృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** వివాహిత అదృశ్యమైన సంఘటన మండల పరిధిలోని రేజింతల్‌లో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ ఎం మహేష్‌గౌడ్ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7వ తారీఖున ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పా పెట్టకుండా మారేపల్లి లక్ష్మి (45) వెళ్లిపోయిందన్నారు. లక్ష్మి కొరకు కుటుంబ సభ్యులు బంధువులు, సన్నిహితుల వద్ద వేతికినా ఆచూకి కానరాకపోవడంతో అదృశ్యమైన లక్ష్మి కుమారుడు మారెపల్లి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అదృశ్యమైన వివాహిత లక్ష్మి కానవస్తే 8712656721కు సమాచారం అందించాలని ఎస్ఐ మహేష్‌గౌడ్ వివరించారు.


మాట్లాడుతున్న బూరుగు సురేష్

### కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలి

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్‌గౌడ్**

**చేర్యాల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** బిజెపిపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్‌గౌడ్ కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండలాధ్యక్షుడు వల్లకొండ సంజీవులు అధ్యక్షతన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సురేష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ బిజెపిపై అనవసర ఆరోపణలు చేస్తుందన్నారు. భారత రాజ్యాంగాన్ని అనేక రకాలుగా అవమానపర్చిన కాంగ్రెస్ పార్టీ ఈరోజు దొంగ ర్యాలీలు, పాదయాత్రలు చేస్తుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఎన్నో నిధులు అందిస్తున్నా తామే ఇస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకుంటుందని మండిపడ్డారు. ఈరోజు పేదలకు సన్న బియ్యం అందుతున్నాయంటే కేంద్ర బిజెపి ప్రభుత్వం అందిస్తున్న నిధులేనని చెప్పారు. బిజెపి అందిస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే రేషన్ దుకాణాల్లోనూ నరేంద్రమోడీ చిత్రపటాన్ని పెట్టాలన్నారు. సమావేశంలో తౌట బాలరాజు, మండికొండ శ్రీనివాస్, కుర్రారం బాల్ నర్సయ్య, కర్క తిరుపతిరెడ్డి, అప్పాల బాబు, పొన్నబోయిన అనిల్, కార్తీక్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మిపతి, బాల్‌రెడ్డి, మల్లేశం, మహేష్, భాను, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వంపై ప్రజలు నిరసనలు తెలపాలి

**పిఏసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ**



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చేర్యాల, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్ల ప్రజలు నిరసనలు తెలపాలని పిఏసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ కోరారు. జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలాధ్యక్షుడు కొమ్ము రవి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని కడవేర్గు, పెద్దరాజుపేట, పోతిరెడ్డిపల్లి, చుంచనకోట, శభాష్‌గూడెం, నాగపురి, గండికుంట, దూదేకులపల్లి గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గ్రామాల్లోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మెరుగు కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో మంజ మల్లేశం, ఆది శ్రీనివాస్, అందె నాని, కర్క సంతోష్, బాలరాజు, నరసింహులు, భాను, లక్ష్మణ్, వినయ్, రాజయ్య, ఎల్లయ్య, కనకయ్య, యాదగిరి, రవీందర్‌రెడ్డి, బాబు, జాను, గూడపు మహేష్, సన్నీ, మోహన్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

### రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ**


పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

**సిద్దిపేట రూరల్(నారాయణరావుపేట), ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి సర్కారు మత రాజకీయాలకు పాల్పడుతూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందని...రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని...రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణరావుపేటలో భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షత్తు పార్లమెంటులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ రాజ్యాంగ విలువలు కాపాడుదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల ఇంచార్జిలు కలీం, మంద పాండు, నాయకులు బర్మ రామచంద్రం, లక్ష్మీ, భిక్షపతి, రమేష్, శ్రీనివాస్, మంద వనజ, రజిని పాల్గొన్నారు.

### చలివేంద్రాన్ని ప్రారంభించిన కమిషనర్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంతోపాటు గాంధీ చౌరస్తా, మల్లెచెట్టు చౌరస్తాలలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎండలో బయట తిరగవద్దన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, జాలిగం శంకర్, రవి కుమార్ ఉన్నారు.

### పెంచిన వంట గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

**కొమురవెల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్లపై పెంచిన రూ.50ధరను వెంటనే తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి తాగూరి రవీందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం పెంచిన గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. వంట గ్యాస్ ధర పెంచడంతో పేదలపై భారం పడుతుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన 11 ఏళ్ల కాలంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచడమే పనిగా పెట్టుకుందన్నారు. అంతర్జాతీయంగా అయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాల్సిన మోడీ ప్రభుత్వం అయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలూపై భారాలు మోపుతుందన్నారు. పెంచిన ధరను తగ్గించకుంటే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉల్లంపల్లి సాయిలు, బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, తేలు ఇస్తారి, నీల భిక్షపతి, తాడూరు మల్లేశం, తాడూరి భరత్‌కుమార్, రాజు, యాదగిరి, కృపాకర్, శ్రవణాచారి, దయానంద్, లెనిన్ రాజు దయ్యాల అనిల్ తదితరులు పాల్గొన్నారు.


గ్యాస్ సిలండర్లతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


మిట్టపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం


బద్దిపడగలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## రైతులు దళారులను నమ్మి మోసపొవద్దు

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**బెజ్జంకి/చిన్నకోడూరు, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** రైతులు దళారుల మాటలునమ్మి మోసపొవద్దని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుండారం, పెరుకబండ, చీలాపూర్, రేగులపల్లి, తిమ్మాయాపల్లి, ముత్తన్నపేట, గాగిల్లాపూర్, వీరాపూర్, తోటపల్లి, దేవక్కపల్లి గ్రామాలలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు 17 శాతం తేమ మించకుండా పొలాల వద్ద ఆరబెట్టి తీసుకరావాలన్నారు. తాలు, ఇతరత్రా గింజలు లేకుండా తూర్పార పట్టాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని మద్దతు ధర పొందాలన్నారు. అంతకు ముందు ఎంపిడిఓ కార్యాలయంలో లబ్దిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఊట్కూరి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడివో కడవెర్గు ప్రవీణ్, ఎంపిఎం నర్సయ్య, ఎఎంస చైర్మన్ పులి కృష్ణ, వైస్‌చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఒగ్గు దామోదర్, ముక్కిస రత్నాకర్ రెడ్డి, సంతోష్, శ్రీకాంత్, పులి సంతోష్, శ్రీనివాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని రామంచ, గంగాపూర్, ఎల్లాయిపల్లి, రంగాయపల్లి, చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్, అల్లీపూర్, మైలారం, పెద్దకోడూరు, గోనెపల్లి, కిష్టాపూర్ గ్రామాలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన వ్యవసాయ పొలాల వద్దనే ఆరబెట్టి తేవాలన్నారు. కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏపిఎం ఆంజనేయులు, వెలుగు సిసిలు, మహిళ సంఘ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు శ్రీకాంత్‌యాదవ్, ముత్తయ్య, పర్శరాములు, అరుకాల శ్రీకాంత్‌యాదవ్, రామచంద్రం, చంద్రశేఖర్, అక్కి సంతోష్, కామ శ్రీనివాస్, నెమలి సుభాష్, బంక చిరంజీవి, కాముని ఉమేష్‌చంద్ర, సదానందంగౌడ్, సిద్దుల శ్రీనివాస్, పన్యాల లింగారెడ్డి, బాలరాజు, మల్లేశం, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల పరిధిలోని చౌడారంలో అల్లీపూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పిఏసిఎస్ చైర్మన్ సదానందంగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్యాల అనిత బాలయ్య, మాజీ ఎంపిటిసి ఎమిరెడ్డి భూంరెడ్డి, సొసైటీ సీఈవో బబ్బురు బాలరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

రైతుల సౌకర్యర్థమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని పిఏసిఎస్ చైర్మన్ ఎల్లంకి మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పిఏసిఎస్ పాలమాకుల సంఘం ఆధ్వర్యంలో బద్దిపడగ, దర్గాపల్లి, జెపి తండా, నాగరాజుపల్లి, ఖానాపూర్, మైసంపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సాదుల చంద్రమౌళి, గూగులోత్ జుంలాల్, పెంబర్ల నర్సింలు, ఆయా గ్రామాల ఏఈవోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**మిట్టపల్లిలో...**

**సిద్దిపేట అర్బన్/నంగునూర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో అమ్ముకొని మద్దతు ధరను పొందాలని మిట్టపల్లి పిఏసిఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం మిట్టపల్లిలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్‌ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలాల వద్ద అరబెట్టిన తర్వాతనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గారెడ్డి, పిఏసిఎస్‌డైరెక్టర్లు, నాయకులు పయ్యావుల రాములు, అంకుశావళి, చింతల సంతోష్, రాము పాల్గొన్నారు.

**బద్దిపడగలో...**

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి కార్యదర్శి దేవుపల్లి యాదగిరి కోరారు. బుధవారం పాలమాకుల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బద్దిపడగా గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధర అందించడానికే కాంగ్రెస్ సర్కారు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామ గ్రామాన ఏర్పాటు చేస్తుందన్నారు.

సన్న వడ్లకు సర్కారు అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందన్నారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తప్పెట శంకర్, అచ్చిన సత్తయ్య, ఆవుల నాగరాజు, రమేష్, చేర్యాల బాలయ్య, శేఖర్‌రెడ్డి, పిల్లి నర్సింలు, చాంద్‌పాషా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎస్‌యూఐ జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

### ఘనంగా ఎన్ఎస్‌యుఐ ఆవిర్భావ దినోత్సవం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలను సంఘం నియోజకవర్గ అధ్యక్షులు సనత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించడంతో పాటు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం హుస్నాబాద్, కోహెడ, చిగురుమామిడి, ఎల్కతుర్తి మండలాల అధ్యక్షులతో పాటు యూత్ కాంగ్రెస్‌నాయకులు తదితరులు ఉన్నారు.

### రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



చిరాగ్‌పల్లిలో జై సంవిధాన్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ నేత ఉజ్వల్‌రెడ్డి

**జహీరాబాద్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సిద్ధం ఉజ్వల్‌రెడ్డి అన్నారు. జై బాపు, జై భీం జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు మండల పరిధిలోని చిరాగ్‌పల్లి, బూర్దిపాడ్ గ్రామాల్లో బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి ముప్పు తెచ్చేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవరహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ మహ్మద్ ముబీన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి సెల్ వైస్ చైర్మన్ భీమయ్య, మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్, మాజీ ఎంపిటిసి సభ్యులు హన్మంత్‌రెడ్డి, నాగిశెట్టి, అశ్విన్ పాటిల్, నాథానేయల్, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ అక్బర్, ఇమామ్ పాటిల్, సునీల్‌కుమార్, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన పిట్ల సాయిలు అనారోగ్యం కారణంగా మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి పాండుగౌడ్, బిఆర్ఎస్ బిసిసెల్ మండల అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్‌లు వేర్వేరుగా మృతుని కుటుంబాన్ని బుధవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. వారితోపాటు బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్ల మహేష్, ఉప్పరి యాదగిరి, జుట్టు సుధాకర్, బోయిని కరుణాకర్, చిన్నబోయిని లక్ష్మణ్, చెక్కల నర్సింలు, కొట్టాల మహేష్ ఉన్నారు.


ములుగులో రేషన్‌షాపు వద్ద మోడి బ్యానర్ ఏర్పాటుచేస్తున్న బిజెపి నేతలు

### ప్రతి రేషన్ షాపులో మోడి చిత్రపటం ఏర్పాటుచేయాలి

**-బిజెపి మండల ఉపాధ్యక్షుడు జలంధర్‌రెడ్డి**

**ములుగు, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** ప్రతి రేషన్‌షాపు ముందు ప్రధాన మంత్రి నరేంద్రమోడి చిత్రపటం ఏర్పాటు చేయాలని ములుగు మండల బిజెపి ఉపాధ్యక్షుడు జలంధర్‌రెడ్డి కోరారు. బుధవారం ములుగులో రేషన్ షాపు వద్ద ప్రధానమంత్రి మోడి చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ షాపులో మోడి చిత్రపటం ఇచ్చి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా రేషన్ షాపుల్లో కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి సన్న బియ్యం పథకం గురించి లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి చేపర్తి వీరేశం, బూత్ అధ్యక్షులు గంగలబోయిన శ్రీకాంత్, గుర్రాల నర్సింలు, చర్లపల్లి గోపాలకృష్ణయాదవ్, బిజెపి సీనియర్ నాయకులు కొండ నర్సింలు, గుర్రాల కరుణాకర్, కడపల రవీందర్‌రెడ్డి, కురుమ రాజయ్య, గంగలబోయిన మణికంఠ, తిగుళ్ల స్వామి, ఉప్పరి అరవింద్, కాశమైన శ్రీనివాస్, తొత్తూరు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### బసవేశ్వర స్వామి జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న వీరశైవ సమాజం నాయకులు

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** వీరశైవ సమాజం ఆరాధ్య దైవం బసవేశ్వరస్వామి జయంతి వేడుకలను ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు నరకుల్ల శివప్ప తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వీరశైవ సమాజం నాయకులతో కలిసి మాట్లాడారు. బసవేశ్వరస్వామి జయంతిని అధికారికంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఆకుల బద్రప్ప, ప్రశాంత్, కర్నె నాగరాజు, బావుపల్లి యాదగిరి, గందె శివకుమార్, బావుపల్లి వీరేశం, గరుగుపల్లి రాజమౌళి, శంకరశెట్టి శివలింగం, బద్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన చైర్మన్

**మునిపల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 32 మందికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందుకునేందుకు 18లక్షల 37వేల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం మార్కెట్ కమిటి చైర్మన్ మంతూరి సుధాకర్‌రెడ్డి అందచేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడు సతీష్, ఎంపిడిఓ డాక్టర్ హరినందన్‌రావు, మాజీ ఎంపిపి అధ్యక్షులు రాంరెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు తక్కడపల్లి సంగమేశ్వర్, విఠల్‌రెడ్డి, గుడ్డుపటేల్, గుజ్జరి పాండు, కోట సురేష్, కుమ్మరి సాయిలు, రేగోటి నరేష్‌కుమార్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

### పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**డిసిసి ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్**

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** పేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి సర్కారు ముందుకు సాగుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామానికి చెందిన బుస్సావేని మౌనికకు సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్ రియాజ్‌తో కలిసి సిఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం అందజేసి మాట్లాడారు. సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంలాంటిందన్నారు. పేదల సంక్షేమానికి పాటుపడుతున్న కాంగ్రెస్ సర్కారుకు ప్రతి ఒక్కరూ అండగా నిలువాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కురటి రాజయ్య, చెల్లోజు కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

### గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక


గౌడ సంఘం నూతన కమిటీ

**కొమురవెల్లి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గౌడ సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షులుగా బత్తిని యాదగిరిగౌడ్, దొడ్ల విష్ణుమూర్తిగౌడ్, అధ్యక్షులుగా తాళ్లపల్లి రాజుగౌడ్, ఉపాధ్యక్షులుగా ముత్యం పర్శరాములు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శివలింగ రమేష్‌గౌడ్, కోశాధికారిగా బత్తిని నర్సింలు గౌడ్, శివయ్యగౌడ్, కార్యదర్శులుగా కొయ్యడ నరేష్‌గౌడ్, ముత్యం కరుణాకర్‌గౌడ్, దొడ్ల చిన్నస్వామిగౌడ్, సలహాదారులుగా ముత్యం స్వామిగౌడ్, దొమ్మాట రమేష్‌గౌడ్, గౌరవా సలహాదారులుగా బండకింది బాలకనకయ్య గౌడ్, దొడ్ల వెంకటస్వామిగౌడ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, పటిష్టతకు తమ వంతు కృషి చేస్తామన్నారు. నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించిన సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయి : ఏసిపి సతీష్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయని ఏసిపి వాసాల సతీష్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దూద్యానాయక్‌కు హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి లభించగా పట్టణంలోని ఏసిపి కార్యాలయంలో ఏసిపి సతీష్ దూద్యానాయక్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ పదోన్నతితో పెరిగిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ రానున్న కాలంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

### రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది

**కొమురవెల్లి/నంగునూర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :**

దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని.. రాజ్యాంగాన్ని మార్చాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని మండల కో-ఆర్డినేటర్ సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహదేవుని శ్రీనివాస్‌లు అన్నారు. ఏఐసిసి పిలుపులో భాగంగా జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని కిష్టంపేటలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, కృష్ణ, భాస్కర్, మల్లేశం, రమణారెడ్డి, శ్రీనివాస్, శ్రీనాథ్‌రెడ్డి, రేష్మ, సుమలత, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, చంద్రయ్య, సుధాకర్, నరసింహులుగౌడ్, రాములు, సంపత్, మహేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

**నంగునూర్‌లో...**

రాజ్యాంగ రక్షణ అందరి బాధ్యత అని టిపిసిసి కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. మండల పరిధిలోని దర్గాపల్లి, జెపి తండా గ్రామాలలో ఏఐసిసి కమిటీ పిలుపు మేరకు బుధవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదోళ్ల కళ్లలో అనందం చూడడమే కాంగ్రెస్ సర్కారు లక్ష్యమన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలని బిజెపి సర్కారు చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్కరం తిప్పికొడుదామన్నారు. కార్యక్రమంలో మండల ఇంచార్జిలు పయ్యావుల ఎల్లం యాదవ్, బొమ్మల యాదగిరి, శంకర్, శ్రీకాంత్‌యాదవ్, రమేష్, బాలయ్య, రవీంద్రచారి, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, శ్యామ్‌రెడ్డి, నర్సింలు, శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, యాదగిరి, లింగం, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కిష్టంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడం అందరి బాధ్యత

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**


వార్డు సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** దేశంలో విభజన విధానాన్ని పెంచిపోషిస్తూ ప్రధాని నరేంద్ర మోడి ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి విమర్శించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో 13వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ షహనాజ్ సమీర్ ఆధ్వర్యంలో జై బాపు జై భీమ్ జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న ఆర్ఎస్ఎస్ వారసులకు బుద్ది చెప్పాలని, రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్, దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మగాంధీని సైతం విడిచిపెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఐక్యత, జాతీయ సమగ్రతను దెబ్బతీస్తున్న బిజెపి కులాలు, మతాలు, వర్గాల పేరిట విడదీస్తూ రాజకీయ లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. ప్రతి మతానికి ఓ నమ్మకం ఉంటుందని, వాటిని దెబ్బ తీసే కుట్రలను ప్రజలే బహిర్గతం చేస్తారని చెప్పారు. సర్వమతాలకు పుట్టినిల్లుగా దేశం విలసిల్లుతుందని, స్వతంత్ర ఉద్యమంతో సంబంధంలేని బిజెపి అప్పటి నేతల జ్ఞాపకాలను గుర్తుచేస్తూ రెచ్చగొడుతుందని ఆరోపించారు. కేంద్ర మంత్రులు, ఎంపిలు రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందామని వార్డు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, ఏఎంసి డైరెక్టర్లు కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, డాక్టర్ వాహిద్, నర్సింహ్మారెడ్డి, రాజు, గుంటుకు శ్రీనివాస్, కొనమైన కన్నాయాదవ్, అజ్గర్, అంజియాదవ్, గాడిపల్లి శ్రీనివాస్, వూడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, జంగం రమేష్‌గౌడ్, మహ్మద్ షరీఫ్, కొల్లూరి సత్యం, గుండు లక్ష్మణ్, నేత నాగరాజు, చెప్యాల శేఖర్, దప్పు గణేష్, పొద్దుటూరి వేణు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బక్కయ్య గుప్త

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

**-బిజెపి జిల్లా అధికార ప్రతినిధి**

**న్యాల్‌కల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఎవరికి వారు తమ వంతు కృషి సల్పాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అల్లాడి బక్కయ్యగుప్తా సూచించారు. బుధవారం న్యాల్‌కల్‌లో పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం గంగ్వార్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కయ్యగుప్తా మాట్లాడుతూ దేశాభ్యున్నతికి 10 సంవత్సరాలూ ప్రధాన మంత్రి నరేంద్ర మోది చేస్తున్న కృషిని ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఈదు పల్లి ఈరణ్ణ, జహీరాబాద్ అసెంబ్లి కన్వీనర్ నౌబాద్ జగన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓంకార్‌యాదవ్, యువ మోర్చా మండల అధ్యక్షులు విష్ణు, నాయకులు రాహుల్ పాలింకర్, నవీన్‌కుమార్, బస్వరాజ్, శ్రీకాంత్, వీరారెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**-సిపిఐ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన**



గ్యాస్ సిలెండర్‌తో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

**సదాశివపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** పెంచిన గ్యాస్ సిలెండర్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్‌చేస్తూ బుధవారం పట్టణంలో గాస్ సిలెండర్ లను చేతబూని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులుఎం తాజుద్దీన్ మాట్లాడుతూ పేద ప్రజల నడ్డి విరిగేలా ఏకంగా రూ.50 పెంచడం సరికాదని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన హామీలను గుర్తు చేశారు. అంతర్ జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గాల్సి ఉన్నా తగ్గలేదని, ధరలను తగ్గించకుండా పెంచడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి షఫీ, రజనీ, సాదక్ అలీ, లింగం, మైబెల్లి, ఎం రమేష్, శ్రామిక మహిళా కార్యదర్శి అనుసుజ యాదవ్, రైతు మహిళా కార్యదర్శి జుజ్జమ్మ, తస్లీమ్,రాజమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్



వాసర్‌లో అంగన్‌వాడి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత రాథోడ్

**సిర్గాపూర్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వాసర్ గ్రామం లో కొనసాగుతున్న అంగన్‌వాడి కేంద్రాన్ని బుధవారం ఐసిడిఎస్ సూపర్ వైజర్ సుజాత రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా సుజాత రాథోడ్ పోషణ పక్షం, పోషణ అభియాన్‌పై అవగాహన కల్పించారు. గర్భిణీలు ఆరోగ్యానికి 1000 రోజులు పోషకాహారం తీసుకోవాల్సిన అవసరాలపై అవగాహన కల్పించారు. తల్లిపాలు ఆరు మాసాల వరకు బిడ్డకు పట్టాలని సూచించారు. శిశువులకు అనుబంధ ఆహార పద్దతులు, టీకాలు పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు అంజమ్మ, నిర్మల తదితరులు ఉన్నారు.

## రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమే : ప్రభాకర్‌రెడ్డి



పాదయాత్రలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** పటాన్ చెరు బిఆర్ఎస్ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్ సింధు నిర్వహించిన పాదయాత్ర బీరం గూడ కమాన్ నుండి రుద్రారం గణేష్ గడ్డ దేవాలయం వరకు సాగింది. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, పొన్నబోయిన వేణు, వెంకటేష్ గౌడ్, తుపాకుల రాజు, నరహరి, రుక్మారెడ్డి, సదానంద రెడ్డి, గోపాల్, ఆంజనేయులు, మురళి, అశోక్, వినోద్, వాసుదేవ రెడ్డి, దర్గా శ్రీనివాస్, సూర్యనారాయణ, సత్తయ్య, శేఖర్ గౌడ్, చంద్రారెడ్డి, యాదగిరి, చంద్రశేఖర్,నాయకులు పాల్గొన్నారు.

## మార్డి గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మార్డి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను తీర్చాలని బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీ డీవో కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా బీజేపీ మండల అధ్యక్షులు యెన్నం అనిల్ రెడ్డి మాట్లాడుతూ మార్డి గ్రామంలో కొన్ని రోజులుగా నీటి సమస్య ప్రజలను వేధిస్తోందని అన్నారు. నీటి కోసం మహిళలు పడరాని పాట్లు పడుతున్నారనీ పేర్కొన్నారు. నీటి కొరత తీర్చడంలో అధికారులు విఫలం అయ్యారని ఆరోపించారు. వేసవి కాలం ప్రారంభంలోనే ఈ పరిస్థితి నెలకొందని, భవిష్యత్తుకు ముందస్తు ప్రణాళిక లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అభిలాష్, అరవింద్, నర్సింలు, రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.



నీటి సమస్యను తీర్చాలంటూ వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నేతలు

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయం



చేబర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి



చిన్నగుండవెల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త :** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధరను అందిస్తుందని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని చిన్నగుండవెల్లిలో బుధవారం ఆయన అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే ఇరుకోడు, తోర్నాల, చింతమడక, బస్వాపూర్, పుల్లూరు, సీతారంపల్లి గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నగుండవెల్లిలో హరికృష్ణ మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మైపాల్‌రెడ్డి, లక్ష్మీ, జనార్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, మల్లారెడ్డి, సదాశివరెడ్డి, సీసీలు రాజయ్య, రాజమల్లయ్య, సంధ్య, భాగ్య పాల్గొన్నారు.

**చిన్నకోడూరులో...**

మండల పరిధిలోని అనంతసాగర్, చర్లఅంకిరెడ్డి పల్లి, రామునిపట్ల, కస్తూరిపల్లి, మల్లారం, సికింద్లాపూర్ గ్రామాలో బుధవారం గంగాపూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చైర్మన్ ములకల కనకరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు. నాయకులు చామకూర విజయలింగం, భూంపల్లి బాపురెడ్డి, పర్శరాములు, జేరిపోతుల శ్రీనివాస్, మేడికాయల వెంకటేశం, మొసర్ల మధు సూదన్‌రెడ్డి, జయవర్ధన్‌రెడ్డి, పోచబోయిన గోవింద గిరిస్వామి, సీఈవో నాగరాజు, సిబ్బంది పర్శ రాములు, అంజనేయులు, హరీష్, కాంగ్రెస్ నాయకులు అజ్జుయాదవ్, అనిల్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**మర్కుక్ మండలంలో...**

**మర్కుక్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిఏసిఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, మాజీ వైస్ ఎంపిపి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం వర్ధరాజ్‌పూర్, చేబర్తి గ్రామాల్లో జగదేవ్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు ఆంజనేయులు, అరవింద్, రమేష్, బాల్‌నర్సయ్య, కార్యదర్శి సిద్దేశ్వర్, పిఏసిఎస్ సిఈఓ రాములు, రైతులు పాల్గొన్నారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**

**మర్కుక్, ఏప్రిల్ 9 (ప్రభాతవార్త):** ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని భవానందపూర్, దామరకుంట, మర్కుక్ గ్రామాల్లో ములుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రవీణ్ రెడ్డి, ఏఓ వసంతరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏ-గ్రేడ్ రకానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో పిఏసిఎస్ డైరెక్టర్లు మోర్సు ఏసురాణి జీవన్‌రెడ్డి, కుమ్మరి యాదగిరి, డిసిసి ఉపాధ్యక్షుడు మల్లేశంగౌడ్, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్‌లు భాస్కర్, నర్సింలు, కరుణాకర్, నాగరాజు, బాల్‌నర్సింలు,కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పత్తి నర్సింలు, బాలకృష్ణ, కార్యదర్శి రమేష్‌బాబు, అశోక్, ఏఈఓలు రజనికాంత్, మీనాక్షి, ఆర్ఐ యాదగిరి పాల్గొన్నారు.



తహసీల్దార్ పరమేశంను సన్మానిస్తున్న దృశ్యం

## నూతన తహసీల్దార్‌కు సన్మానం

**గుమ్మడిదల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** నూతన తహసీల్దార్‌గా పరమేశం ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ యువ నాయకులు ఎం. నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచి తులసీదాస్, మాజీ ఎంపిటిసి గోవర్ధన్‌గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డు మాజీ సభ్యులు మేకల యాదగిరి, ఆకుల ఆంజనేయులు, లలిత, నాయకులు మద్దటి వీరస్వామి, సంతోష్ రెడ్డి, ఖాజా పాషా, సంఘం కుమార్, యాదగిరి, హరీష్, మంగలి మురళి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్‌ను కలిసిన ఈర్ల రాజు



నూతన తహశీల్దార్ వెంకటస్వామిని శాలువాతో సన్మానిస్తున్న ఈర్ల రాజు

**అమీన్‌పూర్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ నూతన తాహశీల్దార్‌గా వెంకటస్వామి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయనను అమీన్‌పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాహశీల్దార్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈర్ల రాజు మున్సిపాలిటీ పరిధిలోని పటేల్ గూడా బిహెచ్ఈఎల్ మెట్రో రోడ్ నెంబర్ 4లో రోడ్ల మరమ్మతుల పనులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పటేల్ గూడా హరివిల్లు టౌన్‌షిప్ సొసైటీ అధ్యక్షులు కొలా రాజు, హనుమాన్ టెంపుల్ అధ్యక్షులు నారాయణ, బిహెచ్ఈఎల్ మెట్రో కాలనీ నాయకులు చక్క వెంకటయ్య, సుభాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలల ఎదుగుదలకు బంగారు బాట.. అంగన్‌వాడీ కేంద్రాలు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** బాలల ఎదుగుదలకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మంజుల తెలిపారు. నారాయణఖేడ్ మండలంలోని చాప్ట కె అంగన్వాడీ కేంద్రంలో బుధవారం ఘనంగా స్కూల్ డే నిర్వహించారు. ప్రీ స్కూల్‌లో పిల్లలు అభివృద్ధి చెందుతారని, తల్లిదండ్రులు, గ్రామస్థులు అందరూ పిల్లలను అంగన్వాడీ పాఠశాలలో వేయాలన్నారు. అంగన్వాడీ పిల్లలు చేసిన కృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ విద్యా సంవత్సరం అంగన్వాడీలో చదువుకున్న పిల్లలకు సర్టిఫికేట్‌లు ప్రదానం చేయడం జరిగింది. అంగన్వాడీలో కూడా ఇటువంటి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం కొత్తగా, ఆనందకరంగా ఉందని తల్లిదండ్రులు కొనియాడారు. అంగన్వాడీలో ఉచిత పూర్వ ప్రాథమిక విద్య అందించడంతో పాటు పిల్లలకు ఆటపాటలతో వారిలో ఆసక్తి రేకెత్తించే విధంగా విద్యను అందుస్తున్నామని, అందరూ పిల్లలను అంగన్వాడీ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని తెలియజేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నర్సింలు, ప్రైమరీ పాఠశాల హెచ్ఎం సంగ్రామ్, బాబురావు, హరి సింగ్, హెల్త్ ఆఫీసర్ విజయ్ కృష్ణారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రాములు, అంగన్వాడీ టీచర్ జగదేవి, ఆయా సంతమ్మ, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం

## ఆర్‌వైవిని యువత సద్వినియోగం చేసుకోవాలి: ఎంపిడివో

**నిజాంపేట, ఏప్రిల్ 8, ప్రభాతవార్త :** రాజీవ్ యువ వికాస్ పథకాన్ని మండల యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజిరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాల్డఉతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి రాజీవ్ యువ వికాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు ఆఫ్‌లైన్ దరఖాస్తులు 400 వచ్చాయని, ఆన్‌లైన్ ద్వారా చేసుకున్నటువంటి దరఖాస్తుల వివరాలు అందించలేదని, దరఖాస్తు చేసుకున్న వారు తప్పకుండా ఎంపీడీవో కార్యాలయంలో వారి వివరాలను అందించాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ నర్సింలు, పాల్గొన్నారు.

## 64వ రోజుకు చేరుకున్న రిలే దీక్షలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంప్ యార్డు నిర్మాణానికి వ్యతిరేకంగా గుమ్మడిదలలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారంతో 64వ రోజుకు చేరుకుంది. దీక్షలో భాగంగా గుమ్మడిదల కెఎస్‌జి యువసేనసభ్యులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, కెఎస్‌జి యువసేన సభ్యులు పాల్గొని రిలే నిరాహార దీక్షను ఉద్దేశించి మాట్లాడారు. 64 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డంపు యార్డ్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరభద్ర ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, మద్ది వీరారెడ్డి, మూడు చింతల నరేందర్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, మంద భాస్కర్ రెడ్డి, పడమటి మహిపాల్ రెడ్డి, కాలకంటి రవీందర్ రెడ్డి, చంద్రారెడ్డి, కెఎస్‌జి యువసేన సభ్యులు పోతురాజు సుధాకర్, ఆర్. మల్లేష్, మోహన్ బాబు, బేకు నర్సింగ్ రావు, తొలిచుక్క రవి, బి. ఆంజనేయులు, మురళి, సాయి, నాగరాజు, ప్రభాకర్, నరేష్ కుమార్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ డివిజన్‌కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ప్రభుత్వం స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళనలుచేపట్టడానికి సిద్ధపడతామన్నారు. తగ్గించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ డివిజన్ నాయకులు చిరంజీవి, అశోక్, దత్తు రెడ్డి, పుప్పాల అశోక్, సతీష్, సంజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన కాంగ్రెస్ నేతలు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** అనారోగాలకు గురైన మండలంలోని ఆయా గ్రామాల్లోని 33 మంది కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుకునేందుకు కాంగ్రెస్ నాయకులు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేషారెడ్డి ఆధ్వర్యంలో 33 మందికి 10 లక్షల విలువ గల చెక్కులను నాయకులు అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బలరాం, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, నాయకులు నరసింహారెడ్డి, చంద్రశేఖర్, అంజాగౌడ్, ప్రభు, శ్రీశైలం, సదానందం, బేతయ్య, రాజుగౌడ్, మహేష్, అబ్దుల్, సక్రు బాయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి మత రాజకీయాలను అడ్డుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

**రాజ్యాంగ పరిరక్షణ కోఆర్డినేటర్ ధనలక్ష్మీ**



రాజ్యాంగ పీఠికలో గల ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్, ఏప్రిల్ 8 ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మత రాజకీయాలను అడ్డుకోవడానికి, మారుమూల గ్రామాల నుండి ప్రజలను చైతన్యవంతం చేయడానికి రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను చేపడుతున్నట్లు నారాయణఖేడ్ నియోజకవర్గ రాజ్యాంగ పరిరక్షణ కోఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి తెలిపారు. బుధవారం నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేరు మండలం బీబీ పేట్, ఫతేపూర్ గ్రామాల్లో పాదయాత్రను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. భారత దేశంలో భిన్నత్వంలో ఏకత్వం కాపాడడానికి రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా సమాన హక్కులు కల్పించాలని ఆమె గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు పోచయ్య, మాజీ ఎంపీపీ మల్లేశం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుండు విటల్, బందారి సాయిలు, గుండు సురేష్, జి. దేవదాస్, మల్దొడ్డి తుకారాం, దేవ్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, కృష్ణ గౌడ్, సాయి, గుండా రమేష్, రాధాకృష్ణ, రఘుపతి రెడ్డి, లింగారెడ్డి, శంకర్, అలిగె సాయిలు, సత్య గౌడ్, పోచయ్య, హుస్సేన్, నారాయణలతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. డా. బిఆర్. అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర కోఆర్డినేటర్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్ర కోఆర్డినేటర్ ధనలక్ష్మి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీబీపేట్, ఫతేపూర్ గ్రామ ప్రధాన కూడళ్లలో రాజ్యాంగ పీఠికలో గల ప్రతిజ్ఞ చేయించారు.

## ఆర్‌వైవి పథకానికి దరఖాస్తులు చేసుకోండి

**తహసీల్దార్ భాస్కర్**

**కంగ్టి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రాజీవ్ యువ వికాసం (ఆర్‌వైవి)లో రుణాలు పొందేందుకు ఈ నెల 14వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉందని, యువత ధరఖాస్తు చేసుకుని లబ్దిపొందాలని తహసీల్దార్ భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో భాస్కర్ మాట్లాడుతూ కులధృవీకరణ పత్రాలు గతంలో పొంది ఉంటే ఆ పత్రాలతోనే ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆదాయ ధృవపత్రాలు మాత్రం కొత్తగా పొందాల్సి ఉంటుందన్నారు. ఆదాయ ధృవపత్రాల కొరకు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ధరఖాస్తు చేసుకుని లబ్దిపొందాలని సూచించారు.

## కల్వకుంట్ల కవిత దీక్ష హాస్యాస్పదం

**-రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జెఏసి చైర్మన్**

**కంగ్టి, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** దశాబ్ద కాలం రాష్ట్రాని పాలించిన బిఆర్ఎస్ పార్టీ హయాంలో ఏ మహనీయుడి జయంతిని జరుపుకోలేదని, అధికారం నుంచి ప్రజలు దూరంచేయగానే కల్వకుంట్ల కవితి మొసలికన్నీరు కారుస్తూ పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేయాలని దీక్ష చేయడం హాస్యాస్పదంగా ఉందని టిపిసిసి ఎస్టీ సెల్ వైస్ చైర్మన్, రాష్ట్ర నిరుద్యోగ విద్యార్థి జేఏసి చైర్మన్ వి భీంరావ్ నాయక్ ఎద్దేవ చేశారు. బుధవారం స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ పూలే విగ్రహాన్ని బిఆర్ఎస్ హయాంలో ఎందుకు ఏర్పాటు చేయలేదో ప్రకటించాలని, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధర్నా చౌక్ లేకుండా చేశారని, మరి ఆ ధర్నా చౌక్‌లో కవిత దీక్ష చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యల పైన, మహిళా సమస్యలపై దీక్షలు చేయని కవిత ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని దీక్ష చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తెలంగాణ ప్రజలు మరో మారు బిఆర్ఎస్ మోసం చేయలేదని, బిఆర్ఎస్ మోసాలతో ప్రజలు జాగ్రత్త పద్దారని భీంరావ్ నాయక్ గుర్తు చేశారు.

## న్యాల్‌కల్‌లో సన్నబియ్యం పంపిణీ

**న్యాల్‌కల్, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ చేసిన ప్రతి హామిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. దేశంలో మరే రాష్ట్రంలో రేషన్ వినియోగ దారులకు సన్నబియ్యం పంపిణి చేయడంలేదని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణి చేసి చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, జహీరాబాద్ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, న్యాల్‌కల్ సొసైటీ చైర్మన్ సిద్దిలింగయ్యస్వామి, మాజీసర్పంచ్ గిరీష్‌రావు మహారాజ్, నాయకులు బలరాంరెడ్డి, శ్రీనివాస్‌రెడి, భద్రుస్వామి, రత్నం, పంచాయితీ కార్యదర్శి ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**శిఖర్‌ఖానాలో...**

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శిఖర్‌ఖానాలో బుధవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్ సంఘం మండల అధ్యక్షులు గడ్డే సంగ్‌శెట్టి, మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సచిన్ పాటిల్, నాయకులు అనిల్ పాటిల్, డీలర్లు అమ్రేష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థినికి హెచ్ఎం ఆర్థిక సహాయం

**కంది, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని లక్ష్మీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి విద్యార్థిని పల్లవి కొంత కాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలావతి ఉపాధ్యాయులు యండి ఖంరోద్దిన్ సహకారంతో పల్లవికి ఆర్థిక సహాయం అందచేశారు. విద్యార్థినికి ఆర్థిక సహాయం చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పల్లవి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహాదేవుడిని దర్శించుకున్న ప్రముఖులు

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఇరక్‌పల్లిలో మహాదేవుడి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గౌతమ్ సిద్దు దంపతులు ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు కాంగ్రెస్ యువ నాయకులుక సాగర్ శెట్కార్, మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి, మండల అధ్యక్షులు మాణిక్‌రావుపాటిల్, ఎంపిడిఓ, మాజీ సర్పంచ్ విఠల్‌రావుపాటిల్, పంచాయతీ కార్యదర్శి సురేందర్, సతీష్‌పాటిల్, సోపన్‌రావు పాటిల్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పండరి, నాగిరెడ్డి తదితరులు పాల్గొని ఆలయ కమిటి బాధ్యులు ప్రముఖులను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## నిజాంపూర్ విద్యార్థులకు అపార్ కార్డులు

**సదాశివపేట, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నిజాంపూర్ (కె) గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అపార్ కార్డులను బుధవారం అందచేశారు. ఆధార్‌కార్డులు ఉన్న 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 42 మంది విద్యార్థులకు ఆపార్‌కార్డును రూపొందించి లామినేషన్ చేసిన కార్డులను విద్యార్థులకు అందచేశారు. అపార్ కార్డులపై పోషకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సవనీత, సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

## నాయబ్ తహసీల్దార్‌గా కరుణాకర్

**ఝరాసంగం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** గుమ్మడిదల నుంచి బదిలీపై మండలానికి నాయబ్ తహసీల్దాగా బాధ్యతలు నిర్వహించేందుకు వచ్చిన కరుణాకర్ ఝరాసంగంలోని పార్వతీదేవి సమేత కేతకి సంగమేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న కరుణాకర్‌ను సిబ్బంది సాదరంగా స్వాగతం పలుకగా నాయబ్ తహసీల్దార్‌గా కరుణాకర్ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు మండలంలో నాయబ్ తహసీల్దాగా విధులు నిర్వహించిన యాసిన్ నిజాంపేట్ మండలానికి బదిలీపై వెళ్లారు.

## నేడు కక్కరవాడలో వీరభద్రేశ్వర విగ్రహ ప్రతిష్టాపన

**ఝరాసంగం, ఏప్రిల్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కక్కరవాడ గ్రామంలో నెల 10వ తేదీన ఉదయం 11 గంటలకు వీరభద్రేశ్వర విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహించేందుకు వీరభద్రేశ్వర ఉత్సవ కమిటీ బాధ్యులు తగు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు చేరుకుని స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉండటంతో భక్తులకు ఇబ్బందులు కలగకండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ పట్నాల మహోత్సవం

**నారాయణఖేడ్, ఏప్రిల్ 9 ప్రభాతవార్త:** కల్హేర్ మండలం మార్డి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఐదవ రోజు నిర్వహించిన పట్నాల మహోత్సవం ఘనంగా జరిగింది. మార్డి గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుఱ్ఱపు మచ్చేందర్ భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్డి గౌడ సంఘం పెద్దలు కృష్ణ గౌడ్, సంగారెడ్డి జిల్లా గీత కార్మిక సంఘం ఉపాధ్యక్షులు అంజా గౌడ్, మాణిక్యం ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నారెడ్డి, గుఱ్ఱపు జ్ఞానేశ్వర్, గుఱ్ఱపు శ్రీనివాస్, హనుమాన్లు సేట్, శ్రీనివాస్ గౌడ్, సాయ గౌడ్, బాలరాజ్‌గౌడ్, కారేగామ నాగిరెడ్డి, గుఱ్ఱపు నర్సింలు, రాజాష్ గౌడ్, సుధాకర్, బొమ్మల నర్సింలు, గ్రామ పెద్దలు, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. గ్రామస్థులు భారీ సంఖ్యలో పాల్గొని మహోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరిపారు. పట్నాల మహోత్సవం సందర్భంగా ఆలయం పరిసరాలు భక్తుల నినాదాలతో మార్మోగాయి.



ఘనంగా రేణుక ఎల్లమ్మ పట్నాల మహోత్సవం దృశ్యం